క్లుప్తంగా

కరాటే పోటీల్లో 'రెజినా' విద్యార్థిని ప్రతిభ


భావికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాల్వంచ: ఇటీవల హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో పాల్వంచ రెజినా కాన్వెంట్ స్కూల్ రెండో తరగతి విద్యార్థిని భావిక పాల్గొని ప్రతిభ కనబర్చింది. సబ్ జూనియర్స్ కటా విభాగంలో గోల్డ్, కుమిటే విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భగా శనివారం పాఠశాలలో భావికను హెచ్‌ఎం సైబిల్, కోచ్ మరియమ్మ, విద్యార్థిని తండ్రి జెడ్పీహెచ్ఎస్ యానంబైల్ స్కూల్ అసిస్టెంట్ అంబ్రికా జాదవ్ అభినందించారు.

సింగరేణి వెల్ఫేర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమేష్



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోడ రమేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సంఘం (1630/1982) సర్వసభ్య సమావేశం శనివారం శ్రీరాంపూర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రమేష్‌ను ఎంపిక చేశారు.

బీమా రెన్యూవల్ చేయించుకోవాలి


రైతు బీమా కోసం వచ్చిన రైతులు

పాల్వంచ: అర్హులైన రైతులంతా రైతు బీమాను రెన్యూవల్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏఈఓ అనురిత అన్నారు. శనివారం పాండురంగాపురం గ్రామంలోని రైతు వేదికలో రైతు బీమా రెన్యూవల్ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి ఐదు గ్రామ పంచాయతీల రైతులు రెన్యూవల్ కోసం వచ్చారు. ఏఈఓ మాట్లాడుతూ... నిలిచిన రైతు బీమాను మళ్లీ చేయడం జరుగుతోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంటరుణాలు..


మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇల్లెందురూరల్: రైతులు సకాలంలో రుణాలు చెల్లించి కొత్త రుణాలు పొందాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ సూచించారు. కొమ్ముగూడెం గ్రామపంచాయతీ నాయకులగూడెం గ్రామంలో ఎస్‌బీఐ ఇల్లెందు బ్రాంచ్ ఆధ్వర్యంలో పంటరుణాలపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం రుణమాఫీని రూ.లక్ష వరకు చెల్లించిందని, రూ.2లక్షలు ఆగస్టు 15వ తేదీ వరకు చెల్లిస్తామని ప్రకటించిందన్నారు. రుణమాఫీ పూర్తైన ప్రతీరైతుకు వెంటనే కొత్త రుణం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఇల్లెందు శాఖ చీఫ్ మేనేజర్ పీసీ ప్రధాన్, ఎఫ్‌ఓబీ సురేష్, సూర్నపాక రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటమే నాగరాజుకు నివాళి

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా సమస్యలపై పోరాటమే బి.నాగరాజుకు ఘన నివాళి అని సీపీఎం సీనియర్ నాయకుడు కాసాని ఐలయ్య అన్నారు. అమరజీవి కామ్రేడ్ జీబీ నాగరాజు ప్రథమ వర్ధంతిని శనివారం రుద్రంపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాసాని మాట్లాడుతూ... రుద్రంపూర్ ప్రాంతంలో యువజన ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని, కళల ద్వారా ప్రజలను చైతన్యం పరుస్తూ పాలకుల దోపిడీని గుట్టు రట్టు చేసిన వ్యక్తి అన్నారు. ఈ క్రమంలో గుండాల దాడిని సైతం ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. భౌతికదాడులు సైతం లెక్కచేయకకుండా ఉద్యమంలో పనిచేశారని కొనియాడారు. ప్రస్తుతం బీజేపీ మతోన్మాద విధానాలను కళారూపాల ద్వారా ఎదుర్కొనే నేపథ్యంలో నాగరాజు లేకపోవటం పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, భుక్యా రమేష్, వీర్ల రమేష్, యాసా నరేష్, కాళంగి హరికృష్ణ, గండమాల భాస్కర్, సుబ్బారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలపై చిన్నచూపు

- ఏటా తగ్గుతున్న ప్రవేశాల సంఖ్య
- ప్రచారం, విద్యార్థులను చేర్పించడంపై కొరవడిన శ్రద్ధ
- సభలు, కార్యక్రమాలకే పరిమితమైన కమిటీలు
- త్వరలో ముగియనున్న ప్రవేశాల గడువు



ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇల్లెందురూరల్: సువిశాలమైన స్థలంలో నెలకొల్పబడినప్పటికీ విద్యార్థుల చేరికలు ఆశించిన స్థాయిలో లేక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కళాశాల ప్రత్యేకతలపై ప్రచారం లేకపోవడం, చేరికలపై అధ్యాపకులు, అభివృద్ధి కమిటీ పట్టింపులేకపోవడంతో కళాశాలకు శాపంగా మారింది. ఇటువంటి పరిస్థితిలో కళాశాలలో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాల్సిన పెద్దలు, ఆ దిశగా వారిని కదిలించాల్సిన బాధ్యులు నిర్లక్ష్యం వీడకపోవడం కళాశాలకు ప్రధాన సమస్యగా మారింది.

నామమాత్రపు ప్రవేశాలు..

ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తెలుగు, ఇంగ్లిష్ మీడియం, బీఏ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ బీజెడ్‌సీ, బీజెడ్‌సీఎస్, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్ కోర్సులు ఉన్నాయి. మొత్తంగా 360 సీట్లు ఉన్నాయి. అయితే 2021–22 విద్యా సంవత్సరంలో 180 మంది, 2022–23లో 110 మంది, 23–24లో 134 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు దోస్త్ ఆన్‌లైన్ దరఖాస్తులు మూడు దశలు పూర్తయ్యాయి. ప్రసుతం స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ఇది కూడా ఆగస్టు 2వ తేదీతో ముగుస్తుంది. కానీ ఇప్పటివరకు కేవలం 54 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

కొరవడిన ప్రచారం..

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం దోస్త్ పథకాన్ని అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం విద్యార్థులు తమకు ఇష్టమైన కళాశాలలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కానీ ప్రైవేటు డిగ్రీ కళాశాలలు తమకు అనుబంధంగా ఉన్న జూనియర్ కళాశాల ల్లో చదివిన విద్యార్థుల చేత ఆన్‌లైన్‌లో దగ్గరుండి దరఖాస్తు చేయిస్తూ డిగ్రీలో ప్రవేశాలు పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఉత్తీర్ణులైన విద్యార్థుల వెంటపడి తమ కళాశాలల్లో ప్రవేశాలు పొందేలా ప్రైవేటు కళాశాలలు పోటీపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితే జిల్లా వ్యాప్తంగా ఉన్నప్పటికీ అక్కడి అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు తమ కళాశాల ప్రత్యేకతలను వివరించి ఆన్‌లైన్ ప్రవేశాలు పొందేలా కృషి చేసి సఫలీకృతులవుతున్నారు. కానీ ఎంతో అనుభవం, అంకితభావం కలిగి ఉన్న అధ్యాపకులు, సువిశాలమైన మైదానం, అవసరమైన మేరకు భవన సముదాయం, లాంగ్వేజ్ ల్యాబ్, జిమ్, ప్రొజెక్టర్, న్యాక్‌లో మంచి గ్రేడింగ్ పాయింట్లు పొందిన ఇల్లెందు కళాశాలలో మాత్రం నామమాత్రపు ప్రచారం కూడా కనిపించకుండా పోయింది.

పట్టింపులేని పెద్దలు...

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పలు అనుబంధ కమిటీలు ఉన్నాయి. కళాశాల ప్రణాళిక, అభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థుల కమిటీ, ప్రజాప్రతినిధులు సభ్యులుగా కళాశాలలో అనేక కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. సభలు, సమావేశాలకు వారంతా హాజరై కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిస్తుంటారే తప్ప ఆచరణలో మాత్రం ఎటువంటి సహకారం అందించకపోవడం, కనీస పర్యవేక్షణ కూడా చేయకపోవడం వల్ల విద్యార్థుల ప్రవేశాలపై ప్రభావం చూపాయనే ఆరోపణలు లేకపోలేదు.

సౌకర్యాల కల్పనలో వీడని నిర్లక్ష్యం...

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పట్టణ శివారు ప్రాంతంలో ఉంది. విద్యార్థులు కళాశాలకు చేరుకోవాలంటే సుమారు రెండు కిలోమీటర్ల నడవక తప్పదు. బస్టాండ్ నుంచి అయితే నాలుగు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. గతంలో మానుకోట నుంచి వచ్చే ఆర్డినరీ బస్సులను డిగ్రీ కళాశాల వరకు నడిపేవారు. ఉదయం, సాయంత్రం ఏర్పాటు చేసిన ఈ సౌకర్యంతో విద్యార్థులు అధిక సంఖ్యలో కళాశాలకు చేరుకునేవారు. కానీ నేడు బస్సు డిపో ఏర్పాటైనా ఆ సౌకర్యం లేదు. బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను ప్రశ్నించేవారే లేకుండా పోయారు. అంతేకాకుండా కళాశాలకు అనుబంధంగా ఉన్న మహిళా హాస్టల్ ఒక సామాజిక వర్గానికే పరిమితం కావడంతో వేరొక సామాజిక వర్గం విద్యార్థులు తప్పక ప్రైవేటుకు వెళ్తున్నారు. దీనికి పరిష్కారం చూపేవారే కరువయ్యారు. ఇటీవల ప్రభుత్వం జిల్లాకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మంజూరు చేసింది. సదరు హాస్టల్‌ను ఇల్లెందుకు కేటాయించాలని అడిగేవారే లేకపోవడంతో పాల్వంచకు తరలిపోయింది. ఇంతేకాకుండా అటానమస్‌కు అన్ని అర్హతలున్నా ప్రశ్నించేవారు లేక ఈ దఫా కూడా ఆ అవకాశం దక్కలేదు. ఇలా అనేక కారణాలు కళాశాల మనుగడపై ప్రభావం చూపుతున్నాయి.

ప్రవేశాల పెంపునకు కృషి చేస్తాం...



దోస్త్ ఫేస్ 1, 2, 3లతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్ ద్వారా ఇప్పటి వరకు 54 ప్రవేశాలు నమోదయ్యాయి. ఆగస్టు 2 వరకు ప్రవేశాలు పెరిగేలా కృషి చేస్తాం. కళాశాలకు కొన్ని సౌకర్యాలైనా కల్పిస్తే మరిన్ని ప్రవేశాలు నమోదయ్యే అవకాశం ఉంది.

– డాక్టర్ పోలారపు పద్మ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇల్లెందు

బడ్జెట్‌లో అన్నివర్గాలకు ప్రాధాన్యత


కొత్వాలకు కేక్ తినిపిస్తున్న రంగారావు

పాల్వంచ: తెలంగాణ బడ్జెట్‌లో రైతులతో పాటు రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25 వార్షిక బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం స్థానిక పొంగులేటి కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, షెడ్యూల్డ్ కులాలు, గిరిజనులు, వెనుకబడిన, మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం రూ.వేల కోట్లు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, నూకల రంగారావు, బద్ది కిశోర్, సాధం రామకృష్ణారావు, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, కాల్వ భాస్కర్‌రావు, కాపా శ్రీనివాస్, కనగాల నారాయణ, వెంకటాచారి, వెంకటేశ్వరరావు, భువన సుందర్‌రెడ్డి, రాము, చాంద్ పాషా, నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

జూలూరుపాడు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో భేతాళపాడు పంచాయతీ బిట్టు తండాలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ఐదుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి రక్తనమూనాలు సేకరించినట్లు చెప్పారు. దోమల వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎంలు సుజాత, రీనా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఇల్లెందురూరల్: ప్రతీ విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక సూచించారు. చెన్నంగలగడ్డ గ్రామంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఆశ్రమంలోని ప్రతి విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న ముగ్గురు విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ఆశ్రమంలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

'రాయల' ఆశయ సాధనకు ముందుకు సాగుదాం..

ఇల్లెందురూరల్: రాయల చంద్రశేఖర్ ఆశయమైన సమసమాజ స్థాపన కోసం ప్రజా పోరాటాలలో చురుకుగా పాల్గొనడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని మాస్‌లైన్ నాయకులు వజ్జ వీరభద్రం, జూకంటి గాంధీ అన్నారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహిస్తున్న మాస్‌లైన్ నేత రాయల చంద్రశేఖర్ సంస్మరణసభను విజయవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు పోలారం గ్రామంలో శనివారం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఉన్నత విద్యను వీడి అజ్ఞాత దళంలో చేరి యాభై ఏళ్లపాటు విప్లవోద్యమంలో పనిచేసి పేదల కోసం ఎనలేని సేవ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మోడెం రాంబాబు, తేలె లక్ష్మయ్య, బండి నారాయణ, శ్రీరాం ప్రశాంత్, ఈసాల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. చల్లసముద్రం గ్రామపంచాయతీలో శనివారం రాయల చంద్రశేఖర్ సంతాపసభ నిర్వహించారు. నాయిని రాజు, బోసు, సావిత్రి, కిరణ్, బుర్ర రాఘవులు పాల్గొన్నారు.

ఇల్లెందు: మాస్‌లైన్ కేంద్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ సంతాపసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, జిల్లా నాయకులు నాయిని రాజు కోరారు. శనివారం ఇల్లెందు మాస్‌లైన్ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఆదివారం ఖమ్మంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరగనున్న సంతాపసభను విజయవంతం చేయాలని కోరారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


ఎక్సైజ్ ఎస్ఐను ప్రశ్నిస్తున్న సతీష్‌కుమార్

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ లావుడ్యా సోనీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ విజేందర్ ప్రగతి నివేదికను చదువుతుండగా కాకర్ల ఎంపీటీసీ సభ్యుడు పాన్నెకంటి సతీష్ కుమార్ అడ్డుతగిలారు. బెల్ట్ షాపులు అడ్డగోలుగా నడుస్తుంటే నియంత్రణకు చర్యలు చేపట్టాలని, బడి, గుడికి దగ్గరలోనే ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రవికుమార్ మాట్లాడుతూ.. మండలంలో 100 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల మొక్కల పెంపకం చేపట్టాలని లక్ష్యమన్నారు. పలుశాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ లావుడ్యా సోనీ మాట్లాడుతూ.. మండల సమగ్రాభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. ఐదేళ్ల పదవీకాలంలో తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, వైస్ ఎంపీపీ గాదె నిర్మల, సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఏఓ ఎస్.రఘుదీపిక తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏఐటీయూసీ మహాసభ

జూలూరుపాడు: ఈనెల 29న స్థానిక ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏఐటీయూసీ 6వ మండల మహాసభ జరగనున్నట్లు సంఘం మండల సహాయ కార్యదర్శి పత్తిపాటి మహేష్ తెలిపారు. శనివారం జూలూరుపాడులో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభను జయప్రదం చేసేందుకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గార్లపాటి వీరభద్రం, శివకృష్ణ, రామారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఔషధ మొక్కలు

ఇల్లెందు: ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఔషధ మొక్కలు నాటాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచన మేరకు శనివారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ రణపాల, ఉసిరి, బొప్పాయి, తిప్పతీగ, మునగ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఎన్విరాన్‌మెంట్ అధికారి అతహర్ పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలి

పాల్వంచరూరల్: ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని తహసీల్దార్, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వివేక్ అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లి, నాగారం గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామపంచాయతీ వందశాతం ఓడీఎఫ్ సాధించాలన్నారు.

నాగారంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందని చెప్పారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.12వేలు మంజూరు చేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ఐలు రవికుమార్‌రెడ్డి, హబ్యా, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు బస్ పాస్‌ల పంపిణీ

టేకులపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం టేకులపల్లి బోడు రోడ్డు సెంటర్‌లో దివ్యాంగులకు బస్ పాస్‌లు ఇవ్వనున్నట్లు కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ మలగం దేవేందర్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బస్ పాస్‌ల శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఒక ఫొటో, ఆన్‌లైన్ చార్జీ కొరకు రూ.50 వెంట తెచ్చుకోవాలన్నారు. ఈ బస్ పాస్ ద్వారా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో 50 శాతం చార్జీతో తెలంగాణ రాష్ట్రమంతా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని టేకులపల్లి మండలంలో ఉన్న దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇసనపల్లి శామ్యూల్, బి.నరేందర్ కుమార్ పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం..

మహంకాళి అమ్మవారు


శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బూడిదగడ్డ బస్తీలో కొలువైన శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారు భక్తులు కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా విరాజిల్లుతోంది. ఈ ఆలయంలో మహంకాళి అమ్మవారితో పాటు శివాపంచాయతన, ఆంజనేయస్వామి కూడా కొలువై ఉండగా 29ఏళ్లుగా భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. బూడిదగడ్డ బస్తీలో 1963లో పాసీ కులస్తుల ఆధ్వర్యాన అమ్మవారి ఆలయ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఇందుకు అవసరమైన స్థలాన్ని ఈడ్పుగంటి వరప్రసాదరావు, ఈడ్పుగంటి జగన్మోహన్‌రావు, కనుమూరి పెద్దిరాజు అందజేశారు. ఆతర్వాత 1995లో ఉప్పల నరేంద్రభవానీ స్వామి భక్తుల సాయంతో నూతన ఆలయం నిర్మాణం చేపట్టారు. 2024 ఏప్రిల్ 20న మహంకాళీ అమ్మవారి, పోచమ్మ అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించడంతో పాటు శివపంచాయత క్షేత్రం, శ్రీపోచమ్మదేవి, గాయత్రీదేవి, సుబ్రమణ్యస్వామి, ఉప్పలమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, శివాలయం, దక్షిణ కాళేశ్వరస్వామి, శివపంచాయత ఆలయం, ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించగా పూజలు కొనసాగుతున్నాయి. ఏటా ఆషాఢమాసంలో వారం పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయంలో కాళీ ఉపాసకులు నరేంద్రభవానీ స్వామి ఆధ్వర్యాన ఈడ్పుగంటి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ, భక్తుల సహకారంతో నిత్యపూజలు కొనసాగుతున్నాయి.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్వనాథం

పాల్వంచ: హక్కుల పరిరక్షణకు సంఘటిత, అసంఘటిత కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏఐటీయూసీ పట్టణ రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్‌పాషా మాట్లాడుతూ... ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మి అదానీ, అంబానీలకు అప్పగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్ మాట్లాడుతూ... కార్పొరేట్, ప్రైవేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం తీరును ఎదుర్కోవాలన్నారు.

బ్రీతింగ్ ఎనలైజర్ మిషన్‌ను మార్చండి


ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్‌కు వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: ఆర్టీసీ డ్రైవర్లకు ప్రతీరోజు ఉదయం బ్రీతింగ్ ఎనలైజర్‌తో ఆల్కహాల్ టెస్ట్ మిషన్‌ను ఉపయోగిస్తున్నప్పుడు అది సరిగా పనిచేయడం లేదని, ఆల్కహాల్ తీసుకోకపోయినా, తీసుకున్నట్లు చూపెడుతోందని ఫలితంగా కార్మికులకు పనిష్మెంట్ కింద వారం నుంచి, రెండు నెలల వరకు డ్యూటీలు లేక ఆర్థిక ఇబ్బంది పడుతున్నారని మిషన్‌ను మార్చాలని విన్నవించారు. ఈ మేరకు హైర్ బస్ డ్రైవర్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.వీరన్న భూక్యా రమేష్, లిక్కి బాలరాజు, యూనియన్ నాయకులు కత్తి నరసింహారావు, సైదులు, శివ, జోజి, సాధిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి


విద్యార్థులతో విద్యాశాఖాధికారులు

కొత్తగూడెంఅర్బన్: నిత్యజీవితంలో ఉపయోగపడే వృత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు అన్నారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ప్స్ (ఎన్‌జీసీ)కి చెందిన 54 పాఠశాలలకు సంబంధించిన 163 మంది విద్యార్థులకు ఎల్‌ఈడీ బల్బుల తయారీపై వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు ఆధ్వర్యంలో వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ... నిత్యజీవితంలో తక్కువ పెట్టుబడితో నిర్వహించే పనులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీసీ జిల్లా సహాయ కోఆర్డినేటర్ బి.సంపత్‌కుమార్, ఎన్‌జీసీ రాష్ట్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి పెరిగిన ఆదాయం

పాల్వంచ: మండలంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) పాత కాంప్లెక్స్‌లోని షాపులు, తలనీలాలు, చీరలు ప్రాగుచేసుకొనుట, పూలు, పూలదండలు అమ్ముకోవడం, ఫొటోలు తీసుకునేందుకు హక్కులకు నిర్వహించిన వేలంతో ఆలయానికి ఆదాయం పెరిగింది. శనివారం ఆలయ ఆవరణలో దేవదాయ ధర్మదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పర్యవేక్షణాధికారి పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారి ఆధ్వర్యంలో 11 నెలల కాలం లీజు లైసెన్స్‌కు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో షాప్ నంబర్ 1 నెలకు గత పాట రూ.2.20లక్షలు ఉండగా ఈసారి రూ.3.11లక్షలకు పాడారు. షాప్ నంబర్ 2 గతంలో రూ.50,200 ఉండగా ఈసారి 60,500, షాప్ నంబర్ 3 రూ.83 వేలకు గాను రూ.85వేలు చొప్పున వేలంలో దక్కించుకున్నారు. అదేవిధంగా చీరలు సేకరించుటకు గతంలో రూ.12.16లక్షలు ఉండగా ఈ సారి రూ.16లక్షలు, భక్తులను ఫొటోలు తీసుకొనుటకు రూ.70వేలకు గాను రూ.73 వేల చొప్పున దక్కించుకున్నారు. కాగా షాప్ నంబర్ 4, కొత్త కాంప్లెక్స్‌లోని షాప్ నంబర్ 2, పూల దండలు అమ్ముకొనుట, తలనీలాలు పోగుచేసుకొనుటకు పాటదారులు ఎవరూ రాక పోవడంతో వాయిదా వేశారు.

శంకర్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు: సీఐటీయూ నాయకుడు కూకట్ల శంకర్ మృతదేహాన్ని సందర్శించిన సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకత్వం నివాళులర్పించింది. శనివారం ఇల్లెందులోని నెంబర్–2 బస్తీలోని శంకర్ నివాసానికి చేరుకున్న సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, పి.సోమయ్య, పి.రాజారావు, ఎం.సాయిబాబా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల కార్యదర్శులు అన్నవరపు కనకయ్య, నున్నా నాగేశ్వరరావు, కాసాని ఐలయ్య, మందా నర్సింహరావు, బి.మదు, పిట్టల రవి పాల్గొని శంకర్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. చిన్న తనంలోనే శంకర్ పార్టీ బాధ్యతలు చేపట్టాడని, ఎమర్జెన్సీ కాలంలో పర్సా సత్యనారాయణ, ఏలూరి లక్ష్మీనారాయణలకు కొరియర్‌గా పనిచేశాడని గుర్తు చేశారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

టేకులపల్లి: మానవ అక్రమ రవాణా చేసే వారి పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఏఐడీ) సంస్థ ఆధ్వర్యంలో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా వివిధ రూపాల్లో మారుమూల గ్రామస్థాయిలో కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్, వాట్సాప్ తదితరాలలో మన వ్యక్తిగత వివరాలను పొందుపరచవద్దని అలా చేసినట్లయితే అక్రమ రవాణాదారులకు మనం ఒక అవకాశం ఇచ్చినట్లేనని పేర్కొన్నారు. హెచ్‌ఎం మేరుగు శ్రీనివాస్ మాట్లాడుతూ... పిల్లలు సత్ప్రవర్తనతో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంటట్ సంస్థ సోషల్ మొబిలైజర్ కుటుంబరావు మాట్లాడుతూ... అక్రమ రవాణా విస్తరిస్తోందని ఏ రూపంలోనైనా మనమీద దాడి చేయవచ్చన్నారు. బాల్య వివాహ నిర్మూలన చట్టాన్ని సమగ్రంగా అమలుపరిచినప్పుడే ఆడపిల్లలు చదువుకొని అన్నిరంగాల్లో రాణిస్తారని, వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది, సంస్థ సభ్యుడు మాన్‌సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.